పలువురు అదనపు కలెక్టర్లు బదిలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పలువురు అదనపు కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అపూర్వ చౌహాన్‌ను జోగులాంబ గద్వాల అదనపు కలెక్టర్‌గా, అశ్విని తనజి వకాడేను వరంగల్ అదనపు కలెక్టర్‌గా, బి.రాహుల్‌ను మంచిర్యాల అదనపు కలెక్టర్‌గా, మయాంక్ మిట్టల్‌ను నారాయణపేట్ అదనపు కలెక్టర్‌గా, మంద మకరందును జగిత్యాల అదనపు కలెక్టర్‌గా, ప్రఫుల్ దేశాయ్‌ను జనగాం అదనపు కలెక్టర్‌గా, అభిషేక్ అగస్త్యను మేడ్చల్ అదనపు కలెక్టర్‌గా, కుష్బూ గుప్తను నల్లగొండ అదనపు కలెక్టర్‌గా, రాహుల్ శర్మను వికారాబాద్ అదనపు కలెక్టర్‌గా బదిలీ చేశారు. అడిషినల్ కలెక్టర్లు హరిసింగ్, కందూరి చంద్రారెడ్డి,జల్ద అరుణ శ్రీ, అబ్దుల్ హమీద్, డి.జాన్ శాంసన్‌లను ప్రభుత్వం వద్ద రిపోర్ట్ చేయాల్సిందిగా సిఎస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చెల్లింపులపై ఆందోళనొద్దు...

- ఆరోగ్యశ్రీ పరిధిలో క్యాన్సర్ చికిత్సలు చేయాలి
- మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చెల్లింపులపై ఎలాంటి ఆందోళన చెందొద్దనీ, ప్రభుత్వం సకాలంలో చెల్లిస్తుందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్ రావు ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రులకు హామీ ఇచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని ఒక ప్రయివేటు ఆస్పత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్యాన్సర్ చికిత్సలను ఎక్కువగా ఆరోగ్యశ్రీ పరిధిలో చేయాలని సూచించారు. తద్వారా వారికి నాణ్యమైన వైద్యమందించాలని కోరారు.

ప్రజా వైద్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.11,440 కోట్లు ఖర్చు చేస్తున్నదని చెప్పారు. ఒకే రోజున రాష్ట్రంలో ఎనిమిది మెడికల్ కాలేజీలను ప్రారంభించుకోబోతున్నామనీ, వీటితో కలుపుకుని ప్రభుత్వ వైద్య కళాశాలల సంఖ్య 17కు చేరుకుంటుందని వివరించారు. ఇప్పటికే ఆదిలాబాద్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో క్యాథ్ ల్యాబ్‌లు ప్రారంభించామనీ, మహబూబ్‌నగర్, సిద్ధిపేట జిల్లాల్లో త్వరలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. జిల్లా ఆస్పత్రుల్లో మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలు చేయడం మొదలైందని తెలిపారు.

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వాస్పత్రులను విస్తరిస్తామని జరుగుతున్నదని చెప్పారు. కార్పొరేట్, ప్రయివేటు ఆస్పత్రులు మానవత్వంతో, ప్రేమతో ప్రజలకు సేవ చేయాలని కోరారు.

మతోన్మాదాన్ని ప్రతిఘటిస్తాం

- 12న మోడీ పర్యటనకు వ్యతిరేకంగా నిరసనలు
- సిపిఐ, టిఆర్ఎస్‌తో కలిసి త్వరలో రాజ్‌భవన్ ముట్టడి
- టిఆర్ఎస్‌ను గెలిపించిన మునుగోడు ప్రజలకు ధన్యవాదాలు
- రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలి
- కేంద్రానికి ఏజెంట్లుగా మారిన గవర్నర్లు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

ఈ నెల 12న రామగుండంలో ఎరువుల పరిశ్రమను ప్రారంభించేందుకు ప్రధాని మోడీ వస్తున్నారనీ, ఆయన పర్యటనకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. ఈ అంశంపై సిఎం కెసిఆర్‌తో చర్చించామన్నారు. దేశవ్యాప్తంగా గవర్నర్లు కేంద్రానికి ఏజెంట్లుగా మారారని విమర్శించారు. కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ కుట్ర చేస్తున్నారనీ, మంత్రులను తొలగించాలంటూ ఆదేశిస్తున్నారని అన్నారు. త్వరలోనే రాజ్‌భవన్‌ను ముట్టడిస్తామని చెప్పారు. ఎన్నికల్లో కలిసి పనిచేయడంతోపాటు బిజెపి విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలంటూ సిఎం కెసిఆర్ తనతో చెప్పారన్నారు. సిపిఐ, టిఆర్ఎస్‌తోపాటు కలిసొచ్చే ఇతర శక్తులతో కలిసి మోడీ ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలు, మతోన్మాద భావజాలానికి వ్యతిరేకంగా పోరాడతామని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వామపక్ష పార్టీలు బలపర్చిన టిఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించిన మునుగోడు ప్రజలకు ధన్యవాదాలు చెప్పారు. ఇది గొప్ప విజయమన్నారు. రాష్ట్రంలో బిజెపి మతోన్మాద భావజాలాన్ని ప్రతిఘటిస్తామన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చెప్పినట్టు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఈ ఎన్నిక రాలేదన్నారు. ఇంకోవైపు తాము ఓడినా టిఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బిజెపియేనంటూ బండి సంజయ్ అంటున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఖతమైందంటూ వారు సంతోషిస్తున్నారని చెప్పారు. బిజెపి కుట్రల పట్ల తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈటల, రఘునందన్‌రావు వల్లే ఆ రెండు చోట్ల బిజెపి గెలిచిందని అన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ గడ్డ, అభ్యుదయ భావాలకు నిలయమని చెప్పారు. ఇక్కడ మతోన్మాద భావజాలాన్ని ప్రజలు అంగీకరించే పరిస్థితి లేదనీ, వాటిని ప్రతిఘటిస్తామనీ, కుట్రలు, కుతంత్రాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇడి, సిబిఐతో బెదిరించి ఎమ్మెల్యేల కొనుగోలుకు చేసిన ప్రయత్నాలను ప్రజలు చిత్తు చేశారని చెప్పారు. మునుగోడులో కమ్యూనిస్టుల ఐక్యతతోనే టిఆర్ఎస్ విజయం సాధ్యమైందన్నారు. ఈ గెలుపులో కీలక పాత్ర పోషించినందుకు అహంకారంతో లేమనీ, గర్వంతో ఉన్నామని అన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

మునుగోడులో టిఆర్ఎస్ గెలవడం వరకే పరిమితం కాకుండా ఇచ్చిన వాగ్దానాల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికేంద్రీకరించాలని తమ్మినేని సూచించారు.

వీలైనంత త్వరగా పోడు భూముల సమస్యను పరిష్కరించాలనీ, ఆక్రమణలో ఉన్న ప్రతి సాగుదారునికీ పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. అసంఘటిత, షెడ్యూల్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలివ్వాలనీ, జీవోలను సవరించాలని కోరారు. రైతులు, భూనిర్వాసితులు, ఆర్‌టిసి కార్మికులు, కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలతోపాటు డబుల్‌బెడ్రూం ఇండ్ల పంపిణీపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. బీజేపీని ఎదుర్కోవాలంటే ప్రజాసమస్యల పరిష్కారంతోపాటు కేంద్రం విధానాలను ప్రతిఘటించేందుకు ప్రజాఉద్యమాన్ని నిర్మించాలని కోరారు.

బిజెపి నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలి : చెరుపల్లి

బిజెపి నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలనీ, ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే తీవ్ర పరిణామాలుంటాయని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు హెచ్చరించారు. మొదటినుంచి కమ్యూనిస్టులపైనే ఆ పార్టీ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. టిఆర్ఎస్‌కు వామపక్షాలు మద్దతివ్వడంతో ఓటమి ఖాయం కావడంతో వారికి కంటగింపుగా మారిందన్నారు.

ఓట్లు, ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే లక్షణం ఆపార్టీకే ఉందని అన్నారు. నల్లగొండ రాజకీయాలను కోమటిరెడ్డి బ్రదర్స్ భ్రష్టుపట్టించారని విమర్శించారు. బీజేపీ ప్రమాదాన్ని నిలువరించడం కోసమే టిఆర్ఎస్‌కు మద్దతిచ్చామని చెప్పారు.

బిజెపికి చెంపపెట్టు : జూలకంటి

మునుగోడు ఫలితం బిజెపికి చెంపపెట్టు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. దేశం కోసం, రాష్ట్రం కోసం, ప్రజల కోసం, మతోన్మాద భావజాలాన్ని ఓడించడం కోసమే టిఆర్ఎస్‌కు మద్దతిచ్చామని చెప్పారు. ధనబలం, కేంద్రంలో అధికారంతో గెలవాలన్న వారి కుట్రలను ప్రజలు చిత్తు చేశారన్నారు. బిజెపి నాయకులు ఈ ఎన్నికల సందర్భంగా తెలంగాణకు, మునుగోడుకు ఏం చేస్తారో చెప్పలేదని విమర్శించారు. కానీ రాజగోపాల్‌రెడ్డిని గెలిపిస్తే నెలరోజుల్లో ఈ ప్రభుత్వాన్ని పడగొడతామన్నారని గుర్తు చేశారు. ఏడాదిలో సాధారణ ఎన్నికలుంటాయనేది తెలిసినా రాజగోపాల్‌రెడ్డి స్వార్థం, రూ.18 వేల కోట్ల కాంట్రాక్టు కోసమే రాజీనామా చేశారని అన్నారు. కాంగ్రెస్‌కు ద్రోహం చేసిన ఆయనకు ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన హామీలు కార్యాచరణలో పెట్టాలి

- మంత్రి జగదీశ్, ఎమ్మెల్యే కూసుకుంట్లతో కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మునుగోడు ఉప ఎన్నికలో గెలిచిన టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి సోమవారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు అవకాశమిచ్చి తన విజయానికి కారణమైనందుకు సిఎం కెసిఆర్‌కు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కూసుకుంట్లకు శుభాకాంక్షలు తెలిపిన సిఎం కెసిఆర్ శాలువాతో ఆయనను సత్కరించి దీవించారు. కాగా...మునుగోడు అభ్యర్థి విజయం కోసం కృషి చేసినందుకు పార్టీ నేతలను సిఎం కెసిఆర్ ఈ సందర్భంగా అభినందించారు. పార్టీ మీద, నాయకత్వం మీద విశ్వాసంతో మునుగోడు ప్రజలు టిఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించారని సిఎం పేర్కొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను కార్యాచరణలో పెట్టేందుకు పూనుకోవాలని సూచించారు. సంబంధిత శాఖల మంత్రులు అధికారులతో సమన్వయం చేసుకుంటూ అందుకు తగిన విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని మంత్రి జగదీశ్ రెడ్డిని సిఎం కెసిఆర్ ఆదేశించారు. సిఎంను కలిసిన వారిలో మంత్రి జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యేలు గ్యాదరి కిశోర్, కంచర్ల భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, గొంగిడి సునిత, బొల్లం మల్లయ్య యాదవ్, ఆశన్నగారి జీవన్ రెడ్డి, పైల్ల శేఖర్ రెడ్డి, సైదిరెడ్డి, రవీంద్ర కుమార్ నాయక్, భాస్కర్ రావు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎగ్గె మల్లేశం, ఎం.సి కోటిరెడ్డి, పార్టీ నేత సోమా భరత్ కుమార్, ఉమా మాధవరెడ్డి, చైర్మన్లు దూదిమెట్ల బాలరాజు, మేడె రాజీవ్ సాగర్, ఎ. సందీప్ రెడ్డి, మందాడి సైదిరెడ్డి, చాడా కిషన్ రెడ్డి, వేంరెడ్డి నర్సింహారెడ్డి, శంకర్ తదితరులున్నారు.

తనయుడి మృతి వార్తతో ఆగిన తల్లి గుండె

- కాజీపేటలో విషాద ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొడుకు మృతి చెందాడన్న వార్త విన్న తల్లి గుండె ఆగిపోయిన సంఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం కాజీపేట గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. కాజీపేట గ్రామానికి చెందిన ముచ్చర్ల విజయ్ కుమార్(32) గ్రామంలో డెయిరీఫామ్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. డెయిరీఫామ్‌లో పెట్టుబడి కోసం అప్పులు చేశారు. చిరువ్యాపారంలో ఆదాయం రాకపోగా అప్పులు అధికమయ్యాయి. అప్పుల బాధ భరించలేక మనస్తాపంతో ఆదివారం గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కండ్ల ముందే ఆత్మహత్యకు పాల్పడి విగత జీవిగా మారిన కొడుకు మృతదేహాన్ని చూసి కలత చెందిన తల్లి స్వరూప ఆదివారం రాత్రి గుండెపోటుకు గురై మృతి చెందింది. తల్లీ కొడుకు ఒకేసారి మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు కన్నీటిపర్యంతమయ్యారు. ఘటన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కాజీపేట గ్రామానికి వెళ్లి మృతుల కుటుంబాన్ని పరమర్శించారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అశోక్ గౌడ్, నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మెన్ నయీముద్దీన్, పీఏసీఎస్ చైర్మెన్ రాజు, కాజీపేట సర్పంచ్ హేమలత మదన్మోహన్, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కాజీపేట ఎంపీటీసీ ఆంజనేయులుగౌడ్, తదితరులు పరామర్శించారు.

ఎల్‌సిజిటిఎ ఎమ్మెల్సీ అభ్యర్థిగా రవీందర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి లోకల్ క్యాడర్ ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (ఎల్‌సిజిటిఎ) ఎమ్మెల్సీ అభ్యర్థిగా రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ రవీందర్ పోటీ చేయనున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నామని ఎల్‌సిజిటిఎ అధ్యక్షుడు ఎం వీరాచారి, ప్రధాన కార్యదర్శి ఎం లక్ష్మికాంతరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రపతి ఉత్తర్వులు-2018లో సిటీ క్యాడర్ పోస్టులను మల్టీజోన్-2లో కలపడం వల్ల హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయులు భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోయే అవకాశముందని పేర్కొన్నారు. హైదరాబాద్ సిటీ క్యాడర్‌ను పునరుద్ధరించడమే లక్ష్యంగా రవీందర్‌ను ఎన్నికల్లో నిలబెట్టామని వివరించారు.

వెంకట్‌రెడ్డి కోవర్టు రాజకీయాలు

- ఆయన వల్లే పార్టీ డ్యామేజ్
- పాల్వాయి స్రవంతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మునుగోడు ఉప ఎన్నికల్లో ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోవర్టు రాజకీయాలు చేశారని పాల్వాయి స్రవంతి రెడ్డి విమర్శించారు. సోమవారం నల్లగొండ జిల్లా చండూరులో విలేకరులతో ఆమె మాట్లాడారు. ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోవర్ట్ రాజకీయాలు చేసి కాంగ్రెస్ పార్టీని డ్యామేజ్ చేశారని ఆరోపించారు. మునుగోడు ఉప ఎన్నికల్లో బిజెపి, టిఆర్ఎస్ పార్టీలు ధనబలంతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశాయన్నారు. ప్రలోభాలకు, భయాందోళనకు గురిచేయడం వల్ల ఓటర్లకు ఇబ్బంది కలిగిందన్నారు. తమ ఓటు బ్యాంక్ బిజెపివైపు టర్న్ అయిందన్నారు. త్వరలో హైకమాండ్ వెంకట్‌రెడ్డిపై చర్యలు చూసుకుంటుందని ఆశిస్తున్నామన్నారు. ఇంత అనైతిక రాజకీయాలను తానెప్పుడూ చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మునుగోడు ఉప ఎన్నిక పరిణామాలు చూశాక రాజకీయాలు చేయాలంటేనే భయమేస్తుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శంకర్ నాయక్, అధికార ప్రతినిధి పున్న కైలాస్ నేత, పన్నాల లింగయ్య, మంచు కొండ సంజయ్, కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

18న '56 టిఫా' స్కానింగ్ యంత్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ ఆస్పత్రుల్లో 56 టిఫా స్కానింగ్ యంత్రాలతో పాటు 26 ఆప్తల్మిక్ పరికరాలను (కంటి చికిత్సకు వినియోగించే ఆపరేటింగ్ మైక్రో స్కోప్‌లు) ఈ నెల 18న ప్రారంభించేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్ రావు అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లో టిఎస్ఎంఐడిసి, జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో కొనసాగుతున్న పనుల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నెలవారీ సమీక్ష నిర్వహించిన మంత్రి, డిఎంఇ, టివివిపి పరిధిలోని ఆస్పత్రుల్లో సివిల్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. గర్భిణీలు ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లడాన్ని నిరోధించేందుకు ప్రభుత్వాస్పత్రుల్లో టిఫా స్కానింగ్ యంత్రాలను తీసుకొస్తున్నట్టు తెలిపారు. గాంధీ, నిమ్స్, జహీరాబాద్, హుస్నాబాద్, మల్కాజ్ గిరి, కామారెడ్డి జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్న మాతా శిశు సంరక్షణ కేంద్రాల పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. టీవీవీపీ పరిధిలోని 32 ఆసుపత్రుల అప్ గ్రేడేషన్ పనులు, 13 జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న తెలంగాణ డయాగ్నస్టిక్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఏర్పాటు చేస్తున్న 41 బస్తీ దవాఖానల నిర్మాణాలను డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలన్నారు. సమీక్షలో టీఎస్ఎంఐడీసీ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ రోగులకు ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ పంజగుట్టలోని నిమ్స్ ఆస్పత్రిలో డయాలసిస్ రోగులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలంగాణ కిడ్నీ రోగుల సంక్షేమ సంఘం వెల్లడించింది. ఈ మేరకు సోమవారం ఆ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్.మోహన్ ఒక ప్రకటన విడుదల చేశారు. సరోజినీదేవి కంటి ఆస్పత్రికి చెందిన వైద్యులు డయాలసిస్ విభాగం వద్ద సోమవారం, మంగళవారం రెండు రోజుల పాటు పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలను ఇస్తున్నట్టు తెలిపారు. ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కూలీల ప్రాణం తీసిన లారీ

- అదుపు తప్పి మహిళలపైకి దూసుకొచ్చిన వైనం..
- ఇద్దరు మృతి.. ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పత్తి తీయడానికి నడుచుకుంటూ వెళుతున్న ముగ్గురు మహిళలను వెనుక నుంచి లారీ అదుపు తప్పి ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందారు. మరొకరు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ విషాద ఘటన సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలో సోమవారం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్ మండల కేంద్రానికి చెందిన చింతకింది కవిత(25), ఇప్ప శ్యామల(42), కొంగరి రాజమణి పత్తి తీయడానికి రోడ్డు వెంట నడుచుకుంటూ పోతున్నారు. జిఎంఆర్ ఫంక్షన్ హాల్ ముందుకు రాగానే.. గజ్వేల్ వైపు వెళ్తున్న లారీ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి అనంతరం కూలీల మీదకు దూసుకొచ్చింది. దాంతో చింతకింది కవిత (25) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన పోలీసులు వచ్చి మహిళలను గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఇప్ప శ్యామల(42) కూడా చనిపోయారు. రాజమణి పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ధర్నా

బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకూ మృతదేహాన్ని ఇక్కడి నుంచి తరలించొద్దని గ్రామస్తులు పెద్దఎత్తున రోడ్డుపై ధర్నా నిర్వహించారు. రోడ్డుపై టెంటు వేసి మూడు గంటలపాటు బైటాయించారు. తొగుట సిఐ కమలాకర్ కలుగజేసుకొని బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ గ్రామస్తులు శాంతించలేదు. లారీ యజమాని ఇక్కడికి వచ్చి తక్షణ న్యాయం చేసే వరకూ కదిలేది లేదని భీష్మించుకూర్చున్నారు. చివరకు సిఐ వారికి నచ్చజెప్పి మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముగ్గురి కుటుంబాలకు న్యాయం జరిగే వరకు పోస్టుమార్టం నిర్వహించొద్దని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఎన్నిక ఏదైనా.. ప్రజలంతా కెసిఆర్ వెంటే

- మునుగోడు ఫలితాలపై ఎమ్మెల్సీ కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నిక ఏదైనా రాష్ట్ర ప్రజానీకమంతా సిఎం కెసిఆర్ వెంటే ఉన్నారని, మునుగోడు ఫలితాలు ఈ విషయాన్ని మరోసారి రుజువు చేసిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వరాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. మునుగోడులో టిఆర్ఎస్ పార్టీని గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇన్ని రోజులు అవాకులు, చవాకులు చేసిన బిజెపి నేతలకు మునుగోడు ప్రజలు సరైన సమాధానం ఇచ్చారని అన్నారు. నల్లగొండలో హ్యాట్రిక్ సాధించామని, ఏ ఎన్నిక జరిగిన ప్రజలంతా టీఆర్ఎస్ వైపే ఉంటారని చెప్పారు.

తొమ్మిది మంది అంతర్రాష్ట్ర నిందితుల అరెస్ట్

- రూ.10 లక్షలు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తొమ్మిది మంది అంతర్రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10 లక్షలు, తొమ్మిది సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు నల్లగొండ ఎస్పి రెమా రాజేశ్వరి తెలిపారు. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వచ్చిన ఓ కేసును రాచకొండ కమిషనరేట్ నుంచి జిరో ఎఫ్ఐఆర్ చేసి చిట్యాల పోలీస్ స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఆ కేసుపై చిట్యాల పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 175/2022 సెక్షన్ 379 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దానికి సంబంధించి రెండు సీసీఎస్ స్పెషల్ టీంలను ఏర్పాటు చేసి దొంగల కదలికలపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో నార్కెట్‌పల్లి శివారులో గల కనకదుర్గ హోటల్, దాబా వద్ద కొందరు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉన్నారనే సమాచారం పోలీసులకు అందింది. నార్కట్‌పల్లి సిఐ, చిట్యాల ఎస్ఐ సిబ్బందితో వెంటనే అక్కడికి వెళ్లారు. తొమ్మిది మందిని విచారించారు. వీరంతా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వారు. ఇందులో తాజ్, సర్ఫరాజ్ 15 ఏండ్ల నుంచి ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రం చెన్నై, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి, విజయవాడ, వైజాగ్, గుంటూరు బస్టాండ్లలో దొంగతనాలు చేస్తున్నారు. ప్రయాణికుల బ్యాగ్‌ల నుంచి డబ్బులు, బంగారం దోచుకున్నారు. గతంలో తాజ్, సర్ఫరాజ్ కలిసి నల్లగొండ, నార్కెట్‌పల్లి, కోదాడ, షాద్‌నగర్, హైదరాబాద్ మహంకాళి, అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలు చేశారు. ఇద్దరు 9 నెలలు జైలు శిక్ష కూడా అనుభవించారు. ఆ తర్వాత వారు మరికొందరు స్నేహితులు, బంధువులతో కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. దొంగతనాలు చేస్తున్నారు. సోమవారం నార్కెట్‌పల్లి గ్రామ శివారులో గల పూజిత హోటల్ వద్ద బస్సు ఆగింది. బస్సులో నుంచి కొందరు ప్రయాణికులు టిఫిన్ కోసం దిగారు. ఈ సమయంలో దొంగల ముఠాలోని కొందరు పరిసరాలను గమనిస్తుండగా.. మరికొందరు బస్సు ఎక్కి ఒక లగేజీ బ్యాగ్‌లో నగదు దోచుకున్నారు. ఇదే సమయంలో దాబా వద్ద అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. తొమ్మిది మంది దొంగలను అరెస్టు చేశారు. వారి నుంచి నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన నల్లగొండ డీఎస్పీ నరసింహారెడ్డి, సీసీఎస్ డీఎస్పీ మొగిలయ్య, నార్కట్‌పల్లి సీఐ శివరాంరెడ్డిని ఎస్పీ అభినందించారు.

మహారాజశ్రీ 10వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు మరియు SC, ST కోర్టు, రాజమహేంద్రవరం

M.V.O.P. No. 7/2021

Between:
Mangina Suryarao, S/o. late Chinnabbai @ Abbai, Hindu, age 70 years, Coolie, R/o. D.No. 1-104, Borrampalem, Gandepalli Mandal, E.G.District, PDP, J.C.J. 533 435. ...Petitioner
AND
Shaik Hizaruddin and Others ...Respondents
R-1: Shaik Hizaruddin, S/o. Jamuladdin, Muslim, age 36 years, Driver of Maruthi Alto Car bearing No. TS 15 EV 3962, R/o. 6-6-278/2, Someswarawada, Sangareddy Town, Sangareddy District, Telangana State 502001. ...1st Respondent

పై నంబరు MVOP లో 1వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. 02-12-2022 సం౹౹రం తేదీ ఉదయం 10.30 ని౹౹లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై MVOP లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు MVOP ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

బి.వి.రమణారావు
ఆర్.మైథిలి
రాజమండ్రి 07-11-2022 అడ్వకేట్స్, రాజమండ్రి

Adv. Manoj R. Kharde
IN THE COURT OF CIVIL JUDGE (S.D.) KALYAN AT KALYAN
M.P. 1100/2018
Mrs. Chandana R. Rajwanshi
R/at : c/wing, 203 Devi Vihar, Agra Road Kalyan (W), Thane. ...Petitioner
V/S
Mr. Ratan J. Rajwanshi
R/at : Natraj Dance Academy, Satyasai Nigaman Road, Indira Nagar, Green Bavarchi Hotel, Shree Nagar Colonly, Hyderabad, Pin : 500073. ...Respondent
PUBLIC NOTICE
Petitioner has filed marriage petitioner bearing number 1100/2018 against the respondent husband for seeking divorce u/s. 13(ia) (ib) of Hindu marriage act 1956 the Hon'ble Court previous dated sending a notice to the respondent through registered post A.D. But the said notices not served. The respondent intentionally avoiding the service of notice.
The respondent through this Public notice informed to attend and present before the Hon'ble civil court (S.D.) Kalyan within 30 days on dated 13/01/2023 on through advocate to filed the say and opposed the petitioner on specific date if opponent could not present before this Hon'ble Court then the court will pass ex-parte order and proceed ex-parte order and the divorce as prayed by the granted.
In this case no one will be responsible for the same which the respondent be noted.
Place : Kalyan
Date : 05/11/2022
Assistant Supretendant
Civil Judge (S.D) Kalyan

IN THE COURT OF THE DISTRICT MUNSIF OF VAZHAPADY SALEM DISTRICT, TAMILNADU STATE
OS. No. 87 /2020
1. Smt. Jothi Lakshmi, 2. R. Venkatesh ... Plaintiffs
-V/s-
The Authorised Signatory, KFin Technologies Pvt.,Ltd., Selerium Building, Tower -B, Plot No.31 & 32, Financial District, Nanakramguda, Seleriumpalli, Hyderabad-34, Rangareddy Telangana-500034. ... Defendant
PUBLIC NOTICE
The above suit is filed by the plaintiffs against the defendant before the above Hon'ble Court for the relief of declaration, mandatory injunction and for other reliefs. The hearing of the above suit is posted on 30.11.2022 for appearance of the defendant. The defendant may appear either by himself or through his advocate before the court hall of the above said Hon'ble Court at about 10.30.AM in default the above suit will be decided against the defendant as exparte. This is for the notice of the defendant.
By order of the court, District Munsif Of Vazhapady, Salem District, Tamilnadu.
Counsel for Plaintiff:
S. Mohan, Advocate
B-48, Periyar Colony,
Dadagapatty,
SALEM-636 006.
Cell: 94432 74164.

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం. 18/2022 ఇన్ ఓ.యస్.నెం 277/2019
బిట్వీన్:
Atmakuri Geetha ....డి. హెచ్. ఆర్
ఎదిరి
Simhadri Sankara Bhavani and others ...జె. డి. ఆర్స్
To,
JDR.1 Simhadri Sankara Bhavani, W/o Krishna Vara Prasad,
JDR.2 Simhadri Venkateswara Rao, S/o Krishna Vara Prasad,
Both are R/o. D.No. 5-4-89/1, Gayathri Jewellers, Havani Colony, Premavathipet, Rajendra Nagar, Hyderabad,
పై నెంబరు ఇ.పిలో మీకు శ్రీ కోర్టు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు పంపవలసినదిగా పై కోర్టు వారు ఆర్డరు వేస్తూ ది.30-11-2022వ తేదీకి వాయిదా వేసి యున్నారు. సదరు వాయిదా రోజు ఉదయం గం.10-30ని౹౹లకు మీరు స్వయంగా గాని, మీ తరపు న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టు వారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల సదరు ఇ.పి.ని మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)
వాయిదా: 30-11-2022
Sri CH.Michael
పిటీషనర్ వాది/డి. హెచ్. ఆర్ తరపు అడ్వకేట్
తెనాలి, సెల్:9848769420

రైతు రుణమాఫీ చేస్తాం

- మోడీ విధానాలతో అన్ని వర్గాల్లోనూ భయం
- ప్రాజెక్టులతో డబ్బులు.. ధరణితో భూములు
- గుంజుకోవడమే కెసిఆర్ పని
- 'భారత్ జోడో గర్జన'లో రాహుల్‌గాంధీ
- తెలంగాణలో ముగిసిన జోడో యాత్ర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ ఉదయం ప్రాజెక్టుల రీషెడ్యూల్ పేర డబ్బులు, సాయంత్రం ధరణి పోర్టల్ ద్వారా రైతుల భూములు గుంజుకుంటున్నారని కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు, ఎఐసిసి నాయకులు రాహుల్‌గాంధీ ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతుల భూములపై తిరిగి హక్కులు కల్పిస్తామని, రైతుల రుణాలను మాఫీ చేస్తామని, దీన్ని ఆపే శక్తి ఎవరికీ లేదన్నారు. కేంద్రంలో మోడీ సర్కారు విధానాలతో అన్ని వర్గాల ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయని, ఆ భయాన్ని హింస, ద్వేషంగా మార్చి వ్యాపింపచేస్తూ రాజకీయ ప్రయోజనం పొందుతున్నారని విమర్శించారు. ఈ హింస, విద్వేషానికి వ్యతిరేకంగా భారత్‌జోడో యాత్ర చేపట్టినట్టు వివరించారు. తెలంగాణ ప్రజల నుంచి చాలా నేర్చుకున్నానని చెప్పారు.

రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్ర తెలంగాణలో సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూరు మండలం మేనూరులో 'భారత్ జోడో గర్జన' పేరిట ఆ పార్టీ వీడ్కోలు సభ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంత ప్రజల గొంతునొక్కలేరని, ఎంత అణగదొక్కితే అంతగా పైకి లేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా యాత్రలో ఓ చిన్నారితో ఎదురైన ఉదాహరణ పంచుకున్నారు. తెలంగాణలో విద్య, వైద్యం మొత్తం ప్రయివేటీకరణ చేశారని, ఓ పిల్లాడు డాక్టరో, ఇంజినీరో కావాలంటే లక్షల్లో అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. రాష్ట్ర సర్కారు విద్యా వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిందని విమర్శించారు. ఇందిరాగాంధీ హయాంలోనే దళితులకు, గిరిజనులకు భూములు ఇచ్చారని, యుపిఎ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన గిరిజన చట్టం రాష్ట్ర సర్కారు అమలు చేయడం లేదని ఆరోపించారు. ధరణి పోర్టల్ ద్వారా రైతుల, దళితుల, గిరిజనుల భూ హక్కులను లాక్కుంటున్నారని మండిపడ్డారు. తెలంగాణలో ఏ రైతూ లాభపడలేదని, తన యాత్రలో ఎదురైన ఏ రైతును కదిలించినా కష్టాలేనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాల వల్ల తెలంగాణ యువతకు ఉపాధి దక్కడం లేదని, పేదలకు లాభం జరగడం లేదని విమర్శించారు. మరోవైపు నరేంద్రమోడీ, కేసీఆర్ ఇద్దరూ కలిసే పని చేస్తున్నారన్నారు. లోక్‌సభలో ఏ బిల్లు తీసుకొచ్చినా టీఆర్ఎస్ పూర్తి మద్దతు ఇస్తోందన్నారు. నల్ల వ్యవసాయ చట్టాలకు కూడా మద్దతు ఇచ్చిందని చెప్పారు. కేసీఆర్ ధరణి, ప్రాజెక్టులు అంటే.. మోడీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు మద్దతు ధర లభించడం లేదని, రుణాలు మాఫీ కావడం లేదని, భయం నెలకొందని అన్నారు. ఉద్దేశపూర్వకంగా దేశంలో భయోత్పాతం సృష్టిస్తూ హింస, విద్వేషాన్ని రెచ్చగొడుతున్నారని తెలిపారు. ఈ యాత్రతో తెలంగాణ ప్రజల నుంచి ఎంతో నేర్చుకున్నానని, రాష్ట్రంలో చేసిన పాదయాత్రను ఎప్పటికీ మర్చిపోనని చెప్పారు.

పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏ ఆకాంక్షలతో, ఆశయాలతో తెలంగాణ తెచ్చుకున్నామో ఈ ఎనిమిదేండ్ల కేసీఆర్ పాలనలో సిద్ధించాయా? అని ప్రశ్నించారు. తెలంగాణలో సాగుతున్న అరాచక, రాచరిక పోకడలను తుదముట్టించేందుకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. చక్కెర ఫ్యాక్టరీ, పసుపు బోర్డు అని, జొన్నలకు గిట్టుబాటు ధర అని హామీనిచ్చారని, చివరకు రైతులు పండించిన పంటను కొనడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటను కొనలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉంటే ఎంత? పోతే ఎంత? అని అన్నారు. మోడీ, కేసీఆర్‌ను శంకరగిరిమాన్యాలు పట్టించే బాధ్యత రైతులకు లేదా అని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే సప్త సమస్యలకు పరిష్కారం అన్న మేధావులు.. తెలంగాణ సమాజం సర్వనాశనం అవుతుంటే మీరంతా ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. భారత్‌జోడో గర్జన సభకు తెలంగాణ కాంగ్రెస్ అగ్రనాయకులందరూ హాజరయ్యారు. మాజీ కేంద్ర మంత్రి జైరాం రమేష్, దిగ్విజయ్‌సింగ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాకూర్, సీఎల్పీ నేత మల్లుభట్టివిక్రమార్క, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, హన్మంతరావు, ఎమ్మెల్యే సీతక్క, సంపత్‌కుమార్, శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగారాం తదితరులు హాజరయ్యారు.

మతం మాటున బిజెపి ఉన్మాదం..

- ఫాసిజం దేశానికి ప్రమాదం
- ఐక్య పోరాటాల అవశ్యకత పెరిగింది
- ఎంసిపిఐ(యు) సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మతం మాటున బిజెపి దేశంలో ఉన్మాదాన్ని ప్రేరేపిస్తున్నదని పలు కమ్యూనిస్టు పార్టీల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఎంసిపిఐ(యు) జాతీయ ఐదో మహాసభ బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో 'బిజెపి మతోన్మాద ఫాసిస్టు విధానాలు- వామపక్ష శక్తుల కర్తవ్యం' అంశంపై సోమవారం హైదరాబాద్‌లోని ఓంకార్ భవన్‌లో సెమినార్ నిర్వహించారు. ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సుకన్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన సాగిస్తున్నదని చెప్పారు. ప్రశ్నించిన ప్రతి వాళ్లను ఉపా, రాజద్రోహం, దేశద్రోహం,అర్బన్ నక్సల్స్ పేరుతో జైల్లో పెడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మైనార్టీలపై రకరకాల సాకులతో దాడులు చేస్తోందన్నారు. సిపిఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ సభ్యులు గుర్రం విజయ్ కుమార్ మాట్లాడుతూ.. కాషాయీకరణతో బిజెపి దేశంలో బలపడిందని చెప్పారు. మత విధ్వంసాన్ని సాగిస్తున్నదని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఎస్‌యుసిఐ(సి) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మురహరి మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల్లో నియంతృత్వాన్ని కార్మికా, ప్రజా పోరాటాలు నిలవరించాయని చెప్పారు. సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చలపతి రావు, సిపిఐ(ఎంఎల్) రెడ్ స్టార్ రాష్ట్ర కార్యదర్శి సైదయ్య, ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్, వి తుకారాం నాయక్, రాష్ట్ర కమిటీ సభ్యులు తాండ్ర కళావతి,పల్లె మురళి, ఈ.కిష్టయ్య ఇతరులు పాల్గొన్నారు.

అడ్డా కూలీలను ఆదుకోవాలి

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 25 లక్షలమంది అడ్డా కూలీలు పనికెళ్తేగాని పూట గడవని పరిస్థితి ఉందని, వారిని వెల్ఫేర్ బోర్డు ద్వారా ఆదుకోవాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు వరంగల్ జిల్లా రంగశాయిపేట కమిటీ ఆధ్వర్యంలో నాయుడు పెట్రోల్ పంపు వద్ద పుచ్చలపల్లి సుందరయ్య భవన నిర్మాణ కార్మిక సంఘం లేబర్ అడ్డా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన హాజరై రిబ్బన్ కట్ చేసి అడ్డాను ప్రారంభించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి జెండావిష్కరణ చేశారు. అనంతరం సిఐటియు ఏరియా కార్యదర్శి మాలోత్ సాగర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో చుక్క రాములు మాట్లాడారు. ఆర్‌టిఎ ఆఫీస్ జంక్షన్‌లో పుచ్చలపల్లి సుందరయ్య పేరుతో నూతనంగా లేబర్ అడ్డాను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

భవన నిర్మాణ రంగానికి చెందిన 14 రకాల కార్మికుల్లో అడ్డాకు వచ్చే ప్రతి ఒక్కరికి పని దొరికేలా అందరూ చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ రంగ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, కూలీల సంక్షేమానికి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. తెలంగాణ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఉన్న రూ.3400 కోట్లు కూలీల సంక్షేమానికి వినియోగించాలని జిఒ జారీ చేసినా, ఆచరించకుండా నిధులను మళ్లించడం సరికాదన్నారు. లేబర్ అడ్డాల్లో మహిళా కూలీలకు కనీస సౌకర్యాలు, వసతి లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రోడ్డుమీద పని కోసం ఎదురు చూస్తుంటే ఆర్‌టిఎ వాళ్లు ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. చివరికి షాపు యజమానులతో కూలీలకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి లేబర్ అడ్డాల వద్ద మౌలిక వసతులు కల్పించాలన్నారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగంలో వాహనాలు నడిపే కూలీలకు ఆర్టీఏ వేధింపులు ఎక్కువయ్యాయని, వాటిని మానుకోవాలని అన్నారు.

పరిశోధకులకు అన్నవరం సాహిత్యం ఉపయుక్తం

తెలుగు సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి

ప్రజాశక్తి - కల్చరల్

అన్నవరం దేవేందర్ రచించిన సమగ్ర కవితల సంకలనాలు తెలంగాణా భాష పరిమళాలు అని, ఆ సాహిత్యం భాషా పరిశోధకులకు ఉపయుక్తమని తెలుగు సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్ అన్నారు. అన్నవరం దేవేందర్ 1988 నుంచి 2022 వరకు రచించిన రెండు సమగ్ర కవితా సంకలనాలను రవీంద్రభారతిలోని సాహిత్య అకాడమీ కార్యాలయంలో గౌరీ శంకర్ అవిష్కరించి మాట్లాడారు. నలభై ఏళ్లపాటు దేవేందర్ తెలంగాణ సమాజాన్ని సన్నిహితంగా చూసి అక్షర బద్ధం చేశారని వివరించారు. తెలంగాణ మలి ఉద్యమానికి దేవేందర్ కవితలు ప్రేరణ ఇచ్చాయని అభి నందించారు. కార్యక్రమంలో కాళోజీ అవార్డ్ గ్రహీత కోట్ల వెంకటేశ్వర రెడ్డి, సాహితీవేత్త కె.పీ.అశోక్ కుమార్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో పై స్క్వేర్ టెక్నాలజీస్ గ్లోబల్ డెలివరీ సెంటర్

హైదరాబాద్ : డెట్రాయిట్ కేంద్రంగా పని చేస్తున్న యుఎస్ టెక్ సంస్థ పై స్క్వేర్ టెక్నాలజీస్ తన గ్లోబల్ డెలివరీ సెంటర్ (జిడిసి)ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది. డేటా సైన్స్ అండ్ ఎనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐఒటి, సైబర్ సెక్యూరిటీ, యానిమేషన్, విఎఫ్ఎక్స్, సిజిఐ, ఎఆర్, విఆర్ వంటి అభివద్ధి చెందుతున్న రంగాలపై ఈ కేంద్రం దష్టి సారించనుందని ఆ కంపెనీ తెలిపింది. మదాపూర్‌లోని మైండ్‌స్పేస్‌లో ఏర్పాటు చేసిన దీనిని సోమవారం రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కేంద్రంలో తొలుత 300 మంది ఉద్యోగులు పని చేయనున్నారు. రాబోయే రెండేళ్లలో ఈ సంఖ్య 1,000కి పైగా పెరగనుందని ఆ వర్గాలు తెలిపాయి. "రాష్ట్రంలో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్ పరిశ్రమను పెంపొందించడానికి ప్రభుత్వం ఒక విధానాన్ని తీసుకుంది. హైదరాబాద్‌ను ప్రపంచ యానిమేషన్ రాజధానిగా మార్చేందుకు అనుకూలంగా ఉండే వాతావరణాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని జయేష్ రంజన్ పేర్కొన్నారు. ఈ సెంటర్‌తో ప్రపంచ ఖాతాదారులకు భవిష్యత్తు డిజిటల్

అనుభవాన్ని అత్యుత్తమంగా అందించనున్నామని పై స్క్వేర్ గ్రూప్ ప్రెసిడెంట్ శరత్ కొత్తపల్లి అన్నారు.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను తిరస్కరించలేదు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సిసి డైరెక్టరేట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం 2022-23 విద్యా సంవత్సరానికి చేపట్టిన ఎంబిబిఎస్, బిడిఎస్ ప్రవేశాల సందర్భంగా ఎన్‌సిసి అభ్యర్థులకు సంబంధించిన సర్టిపికెట్ల వెరిఫికేషన్‌ను తాము తిరస్కరించలేదని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సిసి డైరెక్టరేట్ స్పష్టం చేసింది. ఎన్‌సిసి అభ్యర్థులకు సంబంధించి విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో సంబంధిత డైరెక్టరేట్ సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేసింది. సోమవారం వరకు విశ్వవిద్యాలయం నుంచి వెరిఫికేషన్ కోసం సర్టిఫికెట్లు రాలేదని తెలిపింది. పైపెచ్చు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు ఎంఎస్.నెంబర్ 75 పై న్యాయపరమైన కేసులున్నాయంటూ ఈ ఏడాది ఆగస్టులోనే రాష్ట్ర వైద్యారోగ్యశాఖ దృష్టికి తీసుకెళ్లినట్టు వివరించింది. ఇప్పటికీ ఆ శాఖ నుంచి వివరణ కోసం ఎదురు చూస్తున్నామనీ, అభ్యర్థులకు జరిగిన అసౌకర్యానికి విచారాన్ని వ్యక్తం చేసింది. కాళోజీ నారాయణరావు ప్రవేశాల ప్రక్రియపై అభ్యర్థుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతున్నది. ఇప్పటికే ఎన్‌సిసి అభ్యర్థులకు సంబంధించి ఆందోళన నెలకొనగా, శారీరక వికలాంగుల కోటాలో పిజి సీట్లు ఆశించిన వారు సైతం తమకు అన్యాయం జరిగిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదటి రౌండ్‌లో ఫిజికల్లీ హ్యాండిక్యాప్డ్ (శారీరక వికలాంగులు) కోటాకు సంబంధించి మిగిలిన సీట్లన్నింటిని రెండో రౌండ్‌లో చేర్చకపోవడం వల్ల తాము సీటు పొందలేకపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధిక ఫీజుల వసూలుపై వివరణివ్వండి

గురునానక్ కాలేజీకి జెఎన్‌టియుహెచ్ ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఎఎఫ్ఆర్‌సి నిర్ణయించిన దానికంటే డొనేషన్ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారంటూ గురునానక్ ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యంపై జెన్‌టియుహెచ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై వివరణ ఇవ్వాలంటూ ఆ యాజమాన్యాన్ని జెఎన్‌టియుహెచ్ రిజిస్ట్రార్ ఎం మంజూర్ హుస్సేన్ సోమవారం ఆదేశించారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్నారనీ, విద్యార్థుల సర్టిఫికెట్లను ఇవ్వడం లేదని ఈ నెల ఇచ్చిన ఫీజు కంటే అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఈ నెల ఒకటిన జెఎన్‌టియుహెచ్ విసి, రిజిస్ట్రార్‌కు టిఎస్‌టిసిఇఎ అధ్యక్షులు అయినేని సంతోష్‌కుమార్ ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జెఎన్‌టియు వివరణ ఇవ్వాలంటూ ఆ కాలేజీని ఆదేశించింది. పూర్తి వివరాలను వారంలోగా వర్సిటీతోపాటు సంతోష్‌కుమార్‌కు పంపాలంటూ కోరింది. ఆ వర్సిటీ అధికారులు స్పందించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అదే కాలేజీకి చెందిన వంశీకి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గురునానక్‌లో ఘనంగా ఓరియంటేషన్ డే

హైదరాబాద్ : గురునానక్ విద్యా సంస్థల్లో మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలికే ఓరియంటేషన్ డే ప్రోగ్రాంను ఇబ్రహీంపట్నం క్యాంపస్‌లో ఘనంగా నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిఆర్‌డిఒ సైంటిస్టు జి వేణు గోపాల్‌రావు, రైడ్ సంస్థ వ్యవస్థాపకులు అల్వాల దేవేందర్‌రెడ్డి, హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు రాంచందర్ వ్యాస్ భట్టు హాజరయ్యారు. ఇంజనీరింగ్, టెక్నలాజీలో అభివృద్ధి చెందుతున్న రంగాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా మంచి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గురునానక్ సంస్థ ఎండి హెచ్‌ఎస్ సైనీ, డైరెక్టర్ వెంకట్ రావు, ప్రిన్సిపల్ ఎస్ శ్రీనాథ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధంకండి

- మోటారు వాహనాల చట్టాన్ని కార్మికులకు అనుకూలంగా సవరించాలి
- రవాణారంగ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి
- ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రవాణా రంగం లేకుండా ఈ సమాజాన్ని ఊహించడమే సాధ్యంకాదని, ప్రజాజీవనంలో మమేకమై స్వయం ఉపాధితో పనిచేస్తున్న కార్మికులందరూ తమ సమస్యల పరిష్కారం కోసం సమరశీల ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని అఖిల భారత రోడ్డు రవాణా కార్మికుల సమాఖ్య (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి రావినూతల లక్ష్మయ్య పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని మంచికంటి సమావేశ మందిరం (శ్యామల చక్రవర్తి ప్రాంగణం, సూదగాని లక్ష్మీనారాయణ నగర్)లో తుమ్మ విష్ణువర్ధన్ అధ్యక్షతన తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రయివేటు ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ -సిఐటియు) తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభ జరిగింది. మహాసభల ప్రారంభం సూచకంగా రాష్ట్ర అధ్యక్షులు ఎం.సాయిబాబు యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆర్.లక్ష్మయ్య మాట్లాడుతూ.. కోవిడ్ కాలంలో లాక్‌డౌన్ పేరుతో అందరూ ఇళ్లకే పరిమితమైతే.. రవాణారంగ కార్మికులు మాత్రం ప్రాణాలకు తెగించి నిత్యావసర సరుకులు, మందులు అందించడానికి రోడ్డు మీదకు వచ్చి పనిచేశారని కొనియాడారు. ప్రజలకు కనీస అవసరాలు, భద్రత అందిస్తూ సేవా రంగంలో పనిచేస్తున్న రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రవాణా రంగాన్ని కుదేలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం మోటారు వాహనాల చట్టాన్ని సవరించిందని ఆరోపించారు. స్వయం ఉపాధితో రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులకు పోటీగా కార్పొరేటు సంస్థలైన ఊబర్, ఓలా లాంటి సంస్థలను ప్రోత్సహిస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి లీటర్ డీజిల్, పెట్రోల్‌పై ఎనిమిది శాతం ఇన్ఫ్రాస్ట్రక్చర్ పన్ను వసూలు చేస్తూ, మరలా టోల్‌గేట్ చార్జీలు వసూలు చేయటం ఏమిటని ప్రశ్నించారు. అసంఘటితరంగంగా ఉన్న రవాణా రంగ కార్మికులకు సరైన వేతనాలు, వారాంతపు సెలవులు, ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ వైద్య సౌకర్యాలు లేవన్నారు. అందుకే రవాణారంగ కార్మికులందరూ సోదర కార్మిక సంఘాలను కలుపుకొని సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. విప్లవ పోరాటాల గడ్డ ఖమ్మంలో జరుగుతున్న రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్.వీరయ్య, కళ్యాణం వెంకటేశ్వరరావు, ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీకాంత్, రాష్ట్ర నాయకులు వై.విక్రమ్, టి.విష్ణు, జె.ఉపేందర్, కల్లూరి మల్లేశం, రవీందర్ రెడ్డి, పాషా, రామచందర్ అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలతో సంక్షోభంలో వ్యవసాయ రంగం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్లే వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య విమర్శించారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రావినూతల గ్రామంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 'వ్యవసాయ రంగం - సంక్షోభం- ప్రస్తుత పరిస్థితుల'పై సోమవారం సెమినార్ నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో వీరయ్య మాట్లాడారు. వ్యవసాయ కార్మికుల జీవితాల గురించి మాట్లాడకుండా వ్యవసాయం గురించి మాట్లాడలేమన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్లనే రైతులు అప్పుల పాలవుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారని విమర్శించారు. రైతులు, వ్యవసాయ కార్మికుల జీవితాలు మంచిగా ఉన్నప్పుడే వ్యవసాయ రంగం సంక్షోభంలో లేనట్టని తెలిపారు. కార్మికులు లేకుండా వ్యవసాయం సాగుతుందా? అని ప్రశ్నించారు. ప్రభుత్వాలు ధనిక వర్గాల కోసం పని చేస్తున్నారే తప్ప పేదల గురించి పట్టించుకోవటం లేదన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లేదు, మద్దతు ధర లేదు, ఇలా అయితే వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉండదా? అని ప్రశ్నించారు. పెట్టుబడిదారులపై ప్రభుత్వాలకు భక్తి విపరీతంగా ఉందన్నారు. రైతులపై ఎటువంటి భక్తి, ప్రేమ లేదన్నారు.

కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు రూ.5 లక్షల కోట్లు మాఫీ చేసిందని తెలిపారు. ఎరువులు, పురుగుమందుల ధరలను విపరీతంగా పెంచి వ్యవసాయరంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్నాయని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేసినప్పుడే మన దేశంలో వ్యవసాయ రంగం సంక్షోభం నుంచి బయటపడుతుందన్నారు. దేశంలో ఆహార ఉత్పత్తుల నిల్వలు దారుణంగా పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వ్యవసాయ రంగానికి మతం రంగు పూస్తున్నాడని విమర్శించారు. సెమినార్‌లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా అధ్యక్షులు చింతలచెరువు కోటేశ్వరరావు, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుగులోతు పంతు, వ్యకాస మండల అధ్యక్ష కార్యదర్శులు ఉమ్మనేని రవి, బంధం శ్రీనివాసరావు, ఐద్వా మండల ఉపాధ్యక్షులు గుగులోతు శారద, టీఎస్ యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, సిఐటియు మండల కన్వీనర్ బోయినపల్లి వీరబాబు, ఆర్ఎంపీల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొంగర భూషయ్య తదితరులు పాల్గొన్నారు.

టిఆర్ఎస్ గెలుపు వామపక్షాల భిక్ష : ఈటల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మునుగోడు ఉప ఎన్నికలో టిఆర్ఎస్‌కు దక్కిన గెలుపు వామపక్షాల భిక్షేనని బిజెపి ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇంటలిజెన్స్ నివేదికల ద్వారా సొంతంగా గెలవలేమని నిర్ధారించుకున్న తర్వాతే కెసిఆర్ కమ్యూనిస్టుల దగ్గరకెళ్లి మద్దతు కోరారని తెలిపారు. ప్రజల సమస్యలపై నిత్యం పోరాడే కమ్యూనిస్టు పార్టీల నేతలు వినతులు ఇవ్వడానికి కూడా సిఎం కెసిఆర్ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదనీ, మునుగోడులో సొంతంగా గెలవలేమనే భావన రాగానే వారి వద్దకు పరిగెత్తారని విమర్శించారు. అందితే జుట్టు, అందకపోతే కాళ్లు పట్టుకునే రకం కేసీఆర్ అని తాను మొదటి నుంచీ చెబుతున్నామన్నారు. కేసీఆర్ వైఖరి తెలిసి కూడా కమ్యూనిస్టులు ఆయనకు ఎందుకు మద్దతు ఇచ్చారో అర్థం కాలేదన్నారు. 2014లో మునుగోడులో సిపిఎం, సిపిఐకి 30 వేల దాకా ఓట్లు దక్కాయనీ, ఇప్పుడు వారి ఓట్లే టిఆర్ఎస్ గెలుపులో కీలకపాత్ర పోషించాయని తెలిపారు. ఉప ఎన్నికలో రాజగోపాల్‌రెడ్డి గెలుపు కోసం తాము ఎంత మేరకు పనిచేయాలో అంతమేరకు పనిచేయలేదని చెప్పారు. పక్కాప్రణాళికాతో దృష్టి పెట్టి పనిచేస్తే నూరు శాతం విజయం సాధించేవాళ్లమన్నారు. ఇప్పటికీ నైతికంగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిదే విజయం అన్నారు. తమ కార్యకర్తలు నూతన ఉత్తేజంతో పనిచేస్తారన్నారు.

రండి...చర్చిద్దాం

- వర్సిటీల ఉమ్మడి నియామకాల బిల్లుపై గవర్నర్ అభ్యంతరం
- విద్యాశాఖ మంత్రిని రాజ్‌భవన్‌కు ఆహ్వానించిన తమిళిసై

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని విశ్వవిద్యాలయాల ఉమ్మడి నియామక బిల్లుపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సోమవారం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. రాజ్‌భవన్‌కు వచ్చి బిల్లుపై చర్చించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి గవర్నర్ సూచించారు. ఈ బిల్లుపై అభిప్రాయం కోరుతూ యుజిసికి సైతం గవర్నర్ లేఖ రాశారు. తెలంగాణ శాసనసభ, మండలి ఇటీవల ఆమోదించిన 7 బిల్లులు ప్రస్తుతం గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. అందులో కీలకమైన విశ్వవిద్యాలయాల ఉమ్మడి నియామక బిల్లు ఒకటి. పెద్ద ఎత్తున ఉద్యోగ నియామకాలు, విశ్వవిద్యాలయాల్లోనూ అధ్యాపకుల భర్తీని చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం ఉమ్మడి నియామక బోర్డును ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. అందుకు అనుగుణంగా బిల్లును ప్రవేశపెట్టి శాసనసభ, మండలిలో ఆమోదించింది. ఇప్పటివరకు గవర్నర్ ఆమోదం పొందకపోవడంతో ప్రస్తుతం విశ్వవిద్యాలయాల్లో నియామకాలు చేపట్టేందుకు వీలు లేకుండా పోయింది. ఇటీవల విద్యార్థి సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి బిల్లు ఆమోదంపై ఒత్తిడి వస్తోంది. రెండు రోజుల్లో బిల్లు ఆమోదించకపోతే రాజ్‌భవన్ ముట్టడిస్తామని తెలంగాణ విశ్వవిద్యాలయాల విద్యార్థి జెఎసి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలోనే తమిళిసై రాష్ట్ర ప్రభుత్వం, యుజిసికి లేఖ రాశారు. ఈ బిల్లు ఆమోదించడం ద్వారా ఏమన్నా న్యాయపరమైన సమస్యలు వస్తాయా? అలా జరిగితే ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని గవర్నర్ ప్రశ్నించారు. యుజిసికి సైతం లేఖ రాసిన తమిళిసై.. బిల్లుపై అభిప్రాయాన్ని కోరారు. గత మూడేళ్లుగా ఖాళీలను భర్తీ చేయాలని పదేపదే చెబుతున్నా.. ఎందుకు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత 8 ఏళ్లుగా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీలు ఉన్నప్పటికీ ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పుడు కొత్తగా ఉమ్మడి నియామక బోర్డు తీసుకురావడం ద్వారా మళ్లీ న్యాయపరమైన చిక్కులు తలెత్తుతాయని.. నియామకాలు ఆలస్యమవుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.